క్లుప్తంగా

ఆదాయ వివరాలు ఇవ్వాలి



పర్చూరు గ్రామ కార్యదర్శి మస్తాన్‌కు అర్జీ సమర్పిస్తున్న దళిత నాయకులు

పర్చూరు(చినగంజాం): పర్చూరు పంచాయతీకి సంబంధించిన పదేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలు ఇవ్వాలని కోరుతూ దళిత నాయకులు పంచాయతీ కార్యదర్శిని కోరారు. గత పదేళ్ళ నుంచి పంచాయతీకి పన్నుల రూపంలో వచ్చిన ఆదాయం, ప్రభుత్వ నుంచి మంజూరు అయిన నిధులు, అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన నిధులు తదితర వివరాలను అందజేయాల్సిందిగా కోరారు. దళిత నాయకులు గేరా స్వరాజ్ కుమార్, జంగా వంశీ, నలిగల నానీలు పంచాయతీ కార్యదర్శి ఏ. మస్తాన్‌కు సమాచార హక్కు చట్ట ప్రకారం కోరినట్లు తెలిపారు.

అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

అద్దంకి: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి స్వామి సత్య సైన్య సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం కోవి శ్రీనివాసరావు దంపతుల సైజన్యంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని పట్టణంలోని పొట్టి శ్రీరాములు బొమ్మ వద్ద నిర్వహించారు. అధిక సంఖ్యలో పట్టణ ప్రజలు హాజరైన అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో అఖిలభారత అయ్యప్ప దీక్షప్రచార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు గురుస్వామి, ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కొండ్రగుంట శ్రీనివాససరావు, ఆకుల పెద్దన్న పల్లానాగేశ్వర రావు, మంగమూరు సురేష్ వేదాంత్ పాల్గొన్నారు.

స్థల వివాదంపై ఫిర్యాదు

చీరాల: తన స్థలంలోని వెళ్ళనీయకుండా అడ్డుకుంటున్నారని తోటవారిపాలేనికి చెందిన తాండవలక్ష్మి అనే మహిళ ఆదివారం ఈపురుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. చీరాల మండలం తోటవారిపాలెంకు చెందిన గంగిశెట్టి తాండవలక్ష్మి తన స్థలంలోనికి వెళ్ళనీయకుండా గంగినేని రాంబాబు అడ్డుకుంటున్నారని ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

మోపెడ్ బోల్తా.. ఇరువురికి గాయాలు



గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

మేదరమెట్ల: అద్దంకి వైపు వెళుతున్న టీవీఎస్ మోపెడ్ అదుపు తప్పి బొడ్డువానిపాలెం వద్ద ఆదివారం బోల్తా పడింది. మోపెడ్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలు కాగా 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నట్లు వీరు నేపాల్‌కు చెందిన వారుగా స్థానికులు తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

బల్లికురవ: రెండు బైకులు ఢీ కొన్న ఘటనలో ఇరువురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని పెద అంబడిపూడి కొమ్మినేనివారిపాలెం గ్రామాల మధ్య శనివారం అర్ధరాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు కొమ్మినేనివారిపాలెంకు చెందిన బొబ్బాల లక్ష్మణ్, పెద అంబడిపూడి గ్రామంలోని వీరాంజనేయ స్వామి తిరుణాళ్లకు వెళ్లి బైకుపై గ్రామానికి వస్తున్నాడు. కొప్పరపాడు గ్రామానికి చెందిన దమ్ము సాయి, ప్రసన్న బైకుపై తిరునాళ్లకు వెళ్తుండగా రెండు బైకులు మలుపులో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సాయి లక్ష్మణ్‌లు గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.



భూమిలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

> **భూసారం పెంపు**
>
> వేసవి దుక్కుల వల్ల భూమిలో గాలి చేరే అవకాశం పెరుగుతుంది. దాంతో పంటకు మేలు చేసే సూక్ష్మజీవుల వృద్ధి చెందుతాయి. అదేవిధంగా కలుపు మొక్కల నివారణ జరుగుతుంది. వర్షపు నీరు భూమిలోకి ఇంకడం వలన వేయబోయే పంట బెట్టరాకుండా. వాతావరణంలోని నత్రజని నీటితో కలిసి భూమిలో చేరుతుంది.
>
> – ఏడీఏ ధనరాజ్

పంట విరామం.. భూమికి లాభం

- వేసవి దుక్కులతో ప్రయోజనాలు
- భూమిలో నీరు ఇంకే అవకాశం
- కలుపు మొక్కల నివారణ
- చీడపీడలకు చెక్

అద్దంకి: ప్రస్తుతం సాగుకు విరామం దొరికినట్లే.. మళ్లీ ఖరీఫ్ నాటికి గానీ రైతన్నలు పూర్తి స్థాయిలో వ్యవసాయ పనులకు సంసిద్ధం కారు. అయితే వేసవి దుక్కులతో ఎన్నో ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారులు, రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలో 2.5లక్షల ఎకరాల మెట్ట, మాగాణి భూమి ఉంది. వేసవిలో రెండు మూడు దఫాలుగా వర్షాలు కురవడంతో నేల గుల్ల బారింది. ఆ భూముల్లో ఇప్పటికే కొందరు రైతులు వేసవి దుక్కులు చేయడం ప్రారంభించారు. వేసవి దుక్కులు చేయడం వల్ల కంది, శనగ వంటి మెట్ట పంటలు వేసే పొలంలో వర్షాలు ఆరంభం కాగానే ఆదుక్కుల్లో నీరు లోపలకు ఇంకుతుంది. దాంతో పంటలు వేసిన తరువాత వర్షాలు కురవడం కొంత ఆలస్యమైనా బెట్టకు రాదు. అదే విధంగా నేలలో లోతుగా పదును ఆరిపోకుండా ఉండి మొక్క వేరుకు నీరు అందేలా చేస్తుంది.

కలుపు మొక్కలు, చీడపీడల నివారణ

వర్షాకాలం ఆరంభానికి ముందే అంటే వేసవిలో దుక్కులు చేయడం వల్ల, ఆందులోని వివిధ రకాలైన పంటకు హాని కలిగించే పురుగులు, వేడి తట్టుకోలేని సూక్ష్మజీవులు కూడా నశిస్తాయి. ఇలా వేయబోయే పంటలకు సంబంధించి చీడపీడలు లేకుండా ఆరోగ్యంగా పెరుగుతాయి. అదే విధంగా గత సంవత్సరం కలుపు మొక్కల ద్వారా రాలి, వర్షాలకు మొలకెత్తే మొక్కలన్నీ వేసవిదుక్కుల వల్ల, విత్తనాలతో సహా మాడిపోతాయి. దాంతో కలుపు నివారణ సమస్య తక్కువగా ఉంటుంది.

పేదల కోసం రామానంద ట్రస్ట్ సేవలు

- ఉచిత మగరు వైద్య శిబిరంలో 1276 మందికి వైద్య పరీక్షలు
- రెండు నెలలకు సరిపడే మగరు మందులు ఉచితంగా పంపిణీ



షుగరు వైద్య శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన 1276 మంది ఈ ఉచిత సుగరు వైద్య శిబిరానికి హాజరు కాగా వీరికి డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆశ్రమం మేనేజర్ సురేష్ మాట్లాడారు. గత ఇరవై ఏళ్ల నుంచి రామానంద సరస్వతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక మెడికల్ క్యాంపులు, పేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ, విద్యాభివృద్ధికి పూర్తి సహకారం, గ్రామాల అభివృద్ధికి కావాల్సిన అనేక విధాలుగా సహకారం అందిస్తున్నామన్నారు. సమాజాభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తొమ్మిదేళ్లుగా ప్రతి నెలా ఉచిత షుగరు వైద్య శిబిరాన్ని నిర్వహించి పేదలకు ఉచితంగా నెలకు సరిపడ మందులు అందిస్తున్నామని ట్రస్ట్ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. షుగరు వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనలు పాటిస్తు ఆహార నియమాలు, వ్యాయామాలు చేయాలన్నారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, శంకరరావు, సురేష్, శ్రీనివాస్, కామేశ్వరరావు, చందన, మిత్ర వలి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి 74 మంది హాజరు



పంగులూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జె.పంగులూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో ఆదివారం పంగులూరులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 174 మంది హాజరయ్యారని, అందులో 117 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ణయించినట్లు క్లబ్ అధ్యక్షుడు షేక్ కాలేషా వలి తెలిపారు. ఈ సందర్భంగా షేక్ కాలేషా వలి మాట్లాడుతూ శుక్లాల ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన 117 మందిలో 72 మంది పురుషులు, 42 మంది మహిళలు అని తెలిపారు. వీరిలో ఆదివారం 45 మందికి బస్సుల ద్వారా గుంటూరు జిల్లా కాకానిలో శంకర్ నేత్రాలయానికి తీసుకెళ్లారని తెలిపారు. డాక్టర్ చిన్మయి, శిబిరం నిర్వాహకులు వీరరాఘవయ్య, శంకర్ నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



విద్యార్థులను సత్కరిస్తున్న సోపిరాల గ్రామ పెద్దలు

చినగంజాం: విద్యార్థులకు తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు అందించే ప్రోత్సాహం వారిని చదువులో మరింత రాణించేలా చేస్తుందని రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ తుమ్మలపెంట సీతారామాంజనేయులు అన్నారు. మండలంలోని సోపిరాల గ్రామంలో ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 520 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులను ప్రోత్సహించి అభినందనలు తెలియజేసే కార్యక్రమాన్ని స్థానిక అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. సోపిరాల గ్రామంలో 520 మార్కులకు పైగా వచ్చిన 25 మంది విద్యార్థులతో పాటు మరో 8 మందికి కలిపి మొత్తం 33 మంది విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో శాలువాలు కప్పి, విజ్ఞాన గ్రంథాలను, నగదు ప్రోత్సాహకాలను అందజేసి సత్కరించారు. విద్యార్థులకు విలువైన గ్రంథాలను రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుర్రి రామసుబ్బారావు సమకూర్చగా, నగదు ప్రోత్సాహకాలను రిటైర్డ్ కెనరా బ్యాంక్ మేనేజర్ తుమ్మలపెంట వెంకట సుబ్బారావు దంపతులు, కుర్రి సుబ్బారావు, సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సమకూర్చి అందజేశారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయులు మాట్లాడుతూ సోపిరాల గ్రామంలో ఉత్తమ మార్కులు సాధించేందుకు విద్యార్థులు కష్టపడి చదివారని ఇదే విధంగా ప్రతి ఏడాది మెరిట్ సాధించే విద్యార్థుల కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. కుర్రి రామసుబ్బారావు, ఏడుగుండ్ల నాగేశ్వరావు. టీవీ సుబ్బారావు, గంటా వెంకటస్వామి, టి. జయరావు, సందు శ్రీనువాసరావు, సాయని శ్రీనివాసరావు, పి. పద్మనాభయ్య, పి. హరిబాబు. టి. సీతారామయ్య, ఎన్. హరనాథ్ బాబు, సాంబశివరావు, శరభారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): మండలంలో పదో తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన షేక్ షబనా(593), ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన షేక్ మహ్మద్ బాష (947)లను ఇంకొల్లు మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి ఆదివారం అభినందించారు. గత కొన్నేళ్ళుగా పత్రికా విలేకరిగా పనిచేస్తున్న షేక్ జానీబాష పిల్లలు అయిన వీరిరువురిని భవనం శ్రీనివాసరెడ్డి స్వయంగా వారి ఇంటికి వెళ్ళి వారిరువురికి ఆయన శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాసరెడ్డి, అంకిరెడ్డి, షేక్ జానీ బాష, వారి బంధువులు పాల్గొన్నారు.

వేటపాలెం: పబ్లిక్ పరీక్షల్లో 600 కి 596 మార్కులు సాధించిన పేద విద్యార్థిని సజ్జా దివ్యశ్రీని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు చదువుల్లో రాణించాలని విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు పేర్కొన్నారు. దేవాంగ సంక్షేమ సంఘం, దేవల మను బ్రహ్మ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉన్నత మార్కులు సాధించిన పేద చేనేత విద్యార్థులకు మోమెంటో, నగదు పురస్కారాలు ఆదివారం అందజేశారు. ఉత్తమ మార్కులు సాధించిన దివ్యశ్రీకి రూ.2116 లు అందజేశారు. మరో 9 మంది విద్యార్థులకు మోమెంటోలు నగదు అధ్యక్షుడు బలుకుల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



వేటపాలెం: దివ్యశ్రీని సన్మానిస్తున్న సంఘం నాయకులు



ఇంకొల్లు: మెరిట్ విద్యార్థులను అభినందిస్తున్న భవనం శ్రీనివాసరెడ్డి



శిడిమానును జీడికాయలతో కొడతున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గంగమ్మ తల్లి తిరునాళ్ల

- ఘనంగా 38వ శిడిమాను మహోత్సవం
- అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



విద్యుత్ దీపాల అలంకరణ



గాజులతో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కారంచేడు: గ్రామంలోని పుట్టాయిపాలెంలో కొలువై ఉన్న గ్రామ దేవత గంగమ్మ అమ్మవారి 38వ వార్షికోత్సవ తిరునాళ్లు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన కారంచేడు గంగమ్మ తల్లికి భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఈ ఏడాది ప్రత్యేకంగా గాజులతో అలంకరించారు. దీనికి తోడు మల్లె పూలతో చేసిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. తిరునాళ్ల సందర్భంగా ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి విశేష పూజలను నిర్వహించారు. మహిళా భక్తులు జలబిందెలను ఎత్తుకొని ఆలయ ప్రాంగణానికి చేరి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ రకాల విన్యాసాలతో.. బాకాలతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం శిడి పెళ్లి కొడుకును కనక తప్పెట్లు, యువకుల వీరతాళ్ళ నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వచ్చి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుడి వద్ద ఉన్న శిడిమాను పై భాగంలో ఒక పెట్టెలో మేకపోతును ఉంచి గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి ఆ మేకపోతును భక్తులు జీడి కాయలతో కొట్టి తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. శిడిమాను లాగితే కష్టాలు తొలగిపోతాయనే విశ్వాసంతో భక్తులు శిడిమాను బండిని లాగేందుకు యువకులు, చిన్నారులు, మహిళలు సైతం ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత్రికి తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభలను, అమ్మవారి డిజిటల్ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. మ్యూజికల్ నైట్, హరిశ్చంద్ర వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పర్చూరు, చీరాల, ఇంకొల్లు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో కారంచేడు ఎస్ఐ వి. వెంకట్రావు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. జెయింట్‌వీల్, తదితర సామగ్రి ఆకర్షించాయి. భక్తులు పులిహోర, మజ్జిగ, మంచినీటి వసతులు కల్పించారు.

పాత పుస్తకాలు ఇవ్వండి.. కొత్త పుస్తకాలు తీసుకెళ్లండి



పాత పుస్తకాలు ఇచ్చిన వారికి కొత్త నోటు పుస్తకాలు అందిస్తున్న ప్రతినిధులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్, గీతా యంగ్ సైంటిస్ట్ సంయుక్తంగా ఆదివారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నూతన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల వద్ద ఉన్న పాత పుస్తకాలను ఇస్తే అందుకు సమాన తూకానికి నూత విద్యా సంవత్సరానికి ఉపయోగపడే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. 130 మంది విద్యార్థులు పాత పుస్తకాలు, న్యూస్ పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు మొత్తం 1800 కేజీలను సేకరించి ఇవ్వగా అందుకు సమానంగా రూ.21వేలు విలువ గల నోటుపుస్తకాలు, పెన్సిల్స్, స్కేల్స్, పెన్నులు, జామెంటరీ బాక్సులను పంపిణీ చేశారు. 50 కేజీలకు పైగా పాత పుస్తకాలు తెచ్చిన వారికి బహుమతులు అందించారు. వలివేటి మురళీకృష్ణ, సీహెచ్ బాలవెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, గీతా సంస్థ కిరణ్, పద్మ, సుధ, నవీన్, రీఫాత్, బాజీ, గుర్రం రాఘవరావు, జాలాది కృష్ణ, డాక్టర్ ఐ.బాబూరావు, చీరాల కృష్ణమూర్తి, చారుగుళ్ళ గురుప్రసాద్, జీవై ప్రసాద్, డీవీ సురేష్ పాల్గొన్నారు.

నూతలపాడులో పోలేరమ్మ తిరునాళ్ల రేపు



తిరునాళ్లకు సిద్ధమవుతున్న పోలేరమ్మ ఆలయం

పర్చూరు(చినగంజాం): మండలంలోని నూతలపాడు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి తిరుణాళ్ళ మహోత్సవ కార్యక్రమం ఈ నెల 29 వతేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు వణుకూరి ప్రభాకరరెడ్డి, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, విన్నకోట పెద్దన్న, కుర్రి యోగానందరెడ్డి, కంది అంజిరెడ్డి తెలిపారు.

నల్లబర్లీ పొగాకు సదస్సు జయప్రదం చేయండి

యద్దనపూడి: నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయించాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం పర్చూరులోని అద్దంకమ్మ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ రైతుసంఘం నాయకులు గ్రామాల్లో కరపత్రాలను పంచారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతురావు , మార్టూరు ప్రాంతీయ రైతు సంఘం కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండలంలోని పూనూరు,గన్నవరం,పోలూరు, జాగర్లమూడి, గ్రామాల్లో పర్యటించి రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటలకు పర్చూరులో రైతు సదస్సుకు రైతులు హాజరుకావాలని కోరారు. ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు వి. కృష్ణయ్య, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి, ఏపీ కౌలురైతు సంఘం కార్యదర్శి ఎం. హరిబాబు, రైతుసంఘం నాయకులు కొల్లా రాజమోహన్‌రావు, కె.వి.వి ప్రసాద్, పి.రామారావు, గంగయ్య, కందిమళ్ల రామకోటేశ్వరావు, బండి శంకరయ్య, తదితరులు హాజరవుతారన్నారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం

అద్దంకి: శ్రీప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి దాతలు విరాళాలు ఇస్తున్నారు. ఆదివారం పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన కాకాని హనుమంతరావు కుమార్తెలు మేడా రాధిక రాతి ముఖ మంటప నిర్మాణానికి రూ.1,01,116, భీమని విజయలక్ష్మి రూ.1,10,116 ఏసీ తిమ్మనాయుడికి ఆదివారం అందజేశారు. ధూళిపాళ్ల రామచద్ర ప్రసాద్‌భార్య నాగేశ్వరి 1,000,116 అందజేశారు.

ఉగ్రదాడిపై శాంతియుత నిరసన

వేటపాలెం: కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గ్రామంలో కొవ్వొత్తుల శాంతీయుత ర్యాలీ నిర్వహించారు. సెంటర్ నుంచి జాతీయ జెండాలతో సంతరావూరు రోడ్డు మీదుగా గడియార స్తంభం సెంటర్‌కి చేరుకున్నారు. కిరాణా మర్చంట్ ఆసోసియేషన్ సభ్యులు, విశ్వవిదూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి



దేవుని గీతాలను ఆలపిస్తున్న మహిళలు

చీరాల రూరల్: మహిళలు తమ కుటుంబ బాధ్యతలతో పాటు దైవ చింతన అలవరచుకోవాలని హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ రెవరెండ్ జి. నిరంజన్ అన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి (పెద్దచర్చి) ఆధ్వర్యంలో మహిళల ఆదివారం ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సంఘకాపరులు రెవరెండ్ పిల్లి దేవదాసు, పోకూరి నానిబాబు, కె. కిరణ్‌పాల్, దేటా అశోక్‌కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్‌బాబు, డి. భారతి, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్ విభాగం, మహిళా విభాగం పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి



వాడరేవు తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు



తీరం ఒడ్డున సముద్రం మట్టితో ఆటలాడుకుంటున్న చిన్నారులు

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. వేసవి సెలవులు, ఆదివారం కావటంతో వివిధ గ్రామాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతు సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో సందడి చేశారు. తీరం ఒడ్డున యువకులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు. వేసవి సెలవులు కావడంతో చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలతో పాటు పల్నాడు జిల్లాలోని పలుప్రాంతాలు, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటుగా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెదిన ప్రజలు తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించి తీరంలో సరదాగా గడిపారు. దీంతో వాడరేవులో కోలాహలం నెలకొంది. భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందారు.